సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ద్విచక్ర ప్రత్యేక వాహనాలతో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తిన్నెలపై ఒడ్డున కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

వణుకుతున్న లంక..!

కోడేరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి

గోదావరికి పెరుగుతున్న వరద
నిలిపివేసిన పడవ ప్రయాణాలు
వంతెన నిర్మాణం గాలికి..
లంకగ్రామాల ప్రజల ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి పొంగి ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన గురవుతున్నారు. పడవలే ఆధారమైన లంకవాసుల గుండెల్లో గోదావరి వరద గుబులు రేపుతోంది. రెండు రోజుల నుంచి పెరుగుతూ, తగ్గుతూ వచ్చినా మరోసారి పెరుగుతూ ఉరకలేస్తోంది. అయితే గోదావరి మధ్యలో చిన్నపాటి దీవులుగా ఉండే లంక గ్రామాలకు అవస్థలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం లేదు. ఆయా గ్రామాలకు వెళ్లి రావాలంటే నాటు పడవలను ఆశ్రయించక తప్పదు. గోదావరి వరద వచ్చిందంటే ఆ ప్రాంత ప్రజలు కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చుట్టూ నీళ్లలో రోజుల తరబడి గడపాల్సిన దుస్థితి లంక గ్రామ ప్రజలది. జిల్లాలోని ఆచంట మండలం పెదమల్లం పంచాయతీ పరిధి ఆనగార్లలంక, పెదమల్లంలంక, అయోధ్యలంక గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. ఆయా గ్రామాలు పూర్తిగా గోదావరి మధ్యలో ఉంటాయి. వారు బాహ్య ప్రపంచంలోకి అడుగు పెట్టాలంటే పడవలను ఆశ్రయించక తప్పదు. భారీగా వస్తున్న గోదావరి వరదతో లంక గ్రామాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం లంక గ్రామాల్లోని రైతులు పశువులను ఎత్తైన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరద నేపథ్యంలో ప్రభుత్వం గోదావరిలో పడవలపై ప్రయాణాలను పూర్తిగా నిషేధించింది. దీంతో లంక వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. బయటకు వెళ్లడానికి వీల్లేకపోవడంతో వారికి చేతిలో పని లేని పరిస్థితి ఏర్పడింది. వరద ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురు చూడటమే వారి వంతయ్యింది.

మూగ జీవాలకు మేత కరువు..

పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద నదిలో ఉన్న మధ్యస్థలంకలో వందలాది పశువులను ఉంచి వాటిని మేపుతుంటారు. అక్కడికి పడవలను అనుమతించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో మూగ జీవాలకు మేత భారంగా మారింది.

నిలిపివేసిన పడవ ప్రయాణాలు..

గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో ఆచంట, యలమంచిలి మండలాల్లోని లంక గ్రామాల ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. ఆచంట మండలంలోని ఆనగార్లలంక, పెదమల్లం లంక, కోడేరు, పల్లిపాలెం, అయోధ్యలంక, పుచ్చలంక, రాయి లంక, మర్రిమూల గ్రామాలు ఉన్నాయి, ఆయా లంకల్లో దాదాపు 7 వేల మంది నివాసం ఉంటున్నారు. వీటిలో ఆనగార్లంక, అయోధ్యలంక గ్రామస్తుల పరిస్థితి మరింత దయనీయం. ఆయా లంకలు గోదావరి మధ్యలో ఉన్నాయి. కొద్ది రోజుల నుంచి గోదావరికి వరదలు రావడంతో లంక గ్రామాలకు పడవ ప్రయాణాలు నిలిపివేశారు. దీంతో వారికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వరద చుట్టుముట్టడంతో లంక గ్రామాల్లో ఉన్న ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

వంతెన నిర్మాణాలు విస్మరించిన పాలకులు..

అయోధ్యలంక, ఆనగార్లలంక ప్రజలు ఎప్పటినుంచో వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు. అయితే వారి వేదన అరణ్య రోదనగానే మిగిలింది. నాటు పడవల్లో రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వాలకు మాత్రం వంతెన నిర్మాణాలు చేపట్టడం లేదు. అయోధ్యలంకలో 2014లో సార్వత్రిక ఎన్నికలకు ముందు రూ.50 కోట్లతో అయోధ్యలంకకు, పుచ్చలంకను కలుపుతూ వంతెన నిర్మాణానికి టిడిపి హయాంలో మంత్రిగా పితాని సత్యనారాయణ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఈ వంతెన నిర్మాణాన్ని పట్టించుకునే నాధుడే లేడు. ఇది ఇలా ఉండగా మరోసారి ఆనగార్లంక వాసులను మభ్యపెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. అయితే రూ.80 కోట్లతో ఆనగార్లంక - ఎర్రంశెట్టివారిపాలెం వద్ద నది మధ్య వంతెన నిర్మాణానికి గతంలో పితాని శంకుస్థాపన చేశారు. ఈ వంతెన కూడా కనుచూపు మేరా నిర్మితమయ్యే పరిస్థితిలో లేదని స్థానికులు బహిరంగంగానే చెబుతున్నారు.

తూర్పుగోదావరితోనే అనుబంధం..

మండలంలోని లంక గ్రామాలు భౌగోళికంగా జిల్లాలో ఉన్నా వారికి తూర్పుగోదావరి జిల్లాతోనే అనుబంధం ఎక్కువ. ఆనగార్లంక, పెదమల్లంలంక, పుచ్చలంక, పల్లెపాలెం వాసులకు తూర్పుగోదావరికి చేర్చే ఒకవైపు రోడ్డు సౌకర్యం ఉంది. దీంతో వారు తహశీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయం వంటి పనులకు మాత్రమే పశ్చిమ వైపు వస్తుంటారు. నిత్యావసరాలను తూర్పుగోదావరి జిల్లా నుంచి తెచ్చుకుంటారు.

అయోధ్యలంక వాసుల పరిస్థితి దయనీయం..

అయోధ్య లంక గ్రామం పూర్తిగా గోదావరి మధ్యలో ఉంటుంది. ఆ ఊరు వెళ్లి రావాలంటే పడవ ప్రయాణమే దిక్కు. ప్రతి చిన్న పనికీ వారు పడవ ఎక్కి దిగాల్సిందే. ఈ గ్రామంలోనే సుమారు నాలుగువేల మంది జనాభా ఉన్నారు. వీరు పేరుకు పశ్చిమగోదావరిలో ఉన్నా వీరికి నిత్యం తూర్పుగోదావరి తోనే అనుబంధం ఎక్కువ. విద్య, వైద్యం, వ్యాపారం తదితరాల కోసం వారు తూర్పుగోదావరికి వెళ్లి వస్తుంటారు. వీరికి పశ్చిమ కంటే తూర్పు తీరం దగ్గర. చిన్నపాటి పాయదాటి పుచ్చలంక వెళ్తే అక్కడ నుంచి తూర్పుగోదావరి చేరుకోవడం క్షణాల్లో పని. లంకలో కొబ్బరి అరటి మొక్కజొన్న పచ్చిమిర్చి తమలపాకు కూరగాయలు, అపరాల మార్కెట్ కు వెళ్లాలంటే పడవ ద్వారానే అటు తూర్పుగోదావరి చేరుకోవాల్సిందే.

వంతెన నిర్మించాలి..

అయోధ్యలంక - పుచ్చలంక మధ్య గోదావరిపై వంతెన నిర్మాణానికి గతంలో శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకూ పనులు ప్రారంభించలేదు. వంతెన నిర్మాణం చేపడితే లంక గ్రామ వాసులు క్షేమంగా గ్రామం నుంచి బయటకు వెళ్లగలుగుతారు. లంక గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. వంతెన నిర్మిస్తామని అప్పటి పాలకులు, ప్రస్తుత ఎంఎల్ఎ రంగనాథరాజు కూడా ఆమె ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు దాటినా ఇంతవరకూ ఆ హామీని నెరవేర్చలేదని లంకగ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణాలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కనకాయలంకలో పడవపై వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్న వృద్ధుడు

తగ్గని గోదావరి వరద..
కనకాయలంక ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - యలమంచిలి

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి భారీగా వరద నీటిని విడుదల చేస్తుండడంతో ఆదివారం కూడా గోదావరి వరద కొనసాగింది. దీంతో లోతట్టు ప్రాంతమైన కనకాయలంక గ్రామంలో కాజ్‌వేపై మరింత నీటిమట్టం పెరగడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు, తాగునీరు తెచ్చుకోవాలన్నా, అనారోగ్య సమస్యలతో బాధపడే వారు వైద్యం కోసం వెళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలకు వెళ్లాలన్నా వ్యయ ప్రయాసలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే నాలుగు రోజులుగా పని దొరకని పరిస్థితుల నేపథ్యంలో పూట గడవడం కూడా కష్టంగా మారిందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ఇలాగే కొనసాగితే మరింత తీవ్ర పరిస్థితి వస్తుందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

చించినాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు

మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆందోళనలు

ప్రజాశక్తి - యలమంచిలి

మణిపూర్‌లో మహిళలపై ఇటీవల జరిగిన దారుణాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం చించినాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై సభ్య సమాజం తలదించుకునే విధంగా దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా అక్కడి ప్రభుత్వానికి గాని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి గాని చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇటువంటి దారుణాలను ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు సరిపల్లి జయప్రభ, కానేటి ప్రియాంక, ముస్కుడి జయశ్రీ, గొల్ల విజయ్‌కుమారి, సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, ప్రముఖ వైద్యులు మదన్ గోపాల్ పాల్గొన్నారు.

పాలకొల్లులో ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

పాలకొల్లు : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా పాలకొల్లు ఐద్వా ఆధ్వర్యంలో టిడ్కో గృహాల వద్ద ఆదివారం మహిళలు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా ఈ సంఘటన ఉందని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బాసిన శ్యామల విమర్శించారు. దేశంలో ఇంకా తాలిబాన్ పరిస్థితి ఉండటం సిగ్గు చేటని ఆమె పేర్కొన్నారు.

తణుకు రూరల్: మణిపూర్‌లో మతోన్మాదుల నుంచి ప్రజాస్వామ్యాన్ని, ప్రజలు, మహిళల ప్రాణాలు, హక్కులు కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అమరవీరుల భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్, బాబూరావు, మునిస్వామి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలు క్షీణించాయని ప్రకటించి మే 4వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 355ను అమల్లోకి తెచ్చిందన్నారు. అంటే ఆ రోజు నుంచి మణిపూర్ రాష్ట్ర శాంతి భద్రతల పరిరక్షణ అధికారం కేంద్రం చేతిలోకి వచ్చిందని తెలిపారు. ఆ రోజు నుంచీ మణిపూర్‌లో జరిగిన ప్రతి హింసాకాండకూ కేంద్ర హోం శాఖ మంత్రి, ప్రధానే బాధ్యతని విమర్శించారు. బిజెపి అండదండలతో మతోన్మాదులు ప్రభుత్వం అందిస్తున్న ఆయుధాలతో ఇష్టం వచ్చినట్టు కుకి తెగ వారిని చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో దాడులకు గురౌతున్న కుకి వారికి ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మణిపూర్ ప్రజలకు మద్దతుగా కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుబ్బల గోపి, ఎన్.ఆదినారాయణ బాబు, గార రంగారావు, వల్లూరి వెంకటేశ్వరరావు, గోవిందరాజు, వైటి.రామకృష్ణ, టి. వెంకటేశ్వరావు, నాగేంద్ర కుమార్, రమేష్, బ్రహ్మాజీ, బి.గోపి పాల్గొన్నారు.

మహిళలను నగ్నంగా నడిరోడ్డుపై ఊరేగిస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకులకు కన్నతల్లి కనిపించడం లేదా అని శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాల్ని ప్రశ్నించారు. మణిపూర్‌లో జరిగిన సంఘటన మహిళల హృదయాన్ని కలిచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నతల్లి నడిరోడ్డుపై నగ్నంగా చూస్తుంటే చట్టాలు ఏమైనాయని ప్రశ్నించారు. అత్యాచారం చేసిన వారికి కఠిన శిక్షలు పడకుండా మంత్రులే కొమ్ముకాయడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కాళ్ల : మణిపూర్‌లో మహిళలపై దాడి చేసిన వారిని ఉరితీయాలని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైఖ్యసంఘం రాష్ట్ర అధ్యక్షులు సొడదాసి గంగయ్య డిమాండ్ చేశారు. సీసలిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో రెండు నెలల నుంచి మహిళల పట్ల హింసలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కొంతమంది యువకులు ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి వీధుల వెంబడి నడిపించి అత్యాచారం చేసినా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. కామాంధులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మైలా శ్రీనివాస్, జిల్లా నాయకులు మత్తే రాజ్‌కుమార్, బొకూరి విజయ రాజు, ముసు కుడి రాము, సొడదాసి జాకబ్, డికెవి.ప్రకాష్, ఎం.ఇస్సాక్, ఏడంగి ఏసు, వి.విజయకుమార్, గాతల సందీప్, బొర్రా పార్థు, కోనా రంజిత్, గాతల అశోక్, కమతం మహేష్ పాల్గొన్నారు.

ఆకివీడు : దేశం కోసం కార్గిల్ యుద్ధంలో ప్రాణాలొడ్డి పోరాడిన వీర సైనికుడి కుటుంబానికి రక్షణ లేకపోతే సామాన్యుడికి రక్షణ ఎక్కడ ఉంటుందని ఐద్వా మండల అధ్యక్షురాలు డొకల లక్ష్మి ప్రశ్నించారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మణిపూర్‌లో స్త్రీలను నగ్నంగా తిప్పడం హేయమైన చర్య అని తెలిపారు. సమాఖ్య పట్టణ కార్యదర్శి సంతక ఉదయ్ కుమారి మాట్లాడుతూ ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ, డివైఎఫ్ఐ జిల్లా నాయకుడు బొట్టుపల్లి రాంబాబు, జిల్లా కార్యదర్శి జి.ధనుష్ మాట్లాడారు.

కాళ్ల :ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నేతలు

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ రాజు

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరుతూ పట్టణంలో స్వచ్ఛంద సంస్థలు రెవెన్యూ శాఖ సహకారంతో అవగాహన ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు బ్రోచర్లను ఆనంద్ ఇన్‌లో ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి శ్రీనాథ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజా స్వామ్య పరిరక్షణలో ఓటు ఒక వజ్రా ఆయుధమన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం ప్రాంతంలోని స్లమ్ ఏరియాలో పల్లె గ్రామాల్లో కూడా అవగాహన కార్యక్రమాలను రెవెన్యూ శాఖ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, సిఐ కృష్ణకుమార్, ఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

జిల్లాలో జగనన్న సురక్ష విజయవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఇస్తున్న 11 రకాల సర్టిఫికెట్లు సకాలంలో అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకూ 476 సచివాలయాల పరిధిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీల్లో 4,52,675 సర్వీసులకు నమోదు చేయగా, 4,44,787 సేవలు అందజేసినట్లు తెలిపారు 499 అర్జీలు సరైన ఆధారాలు లేనందున తిరస్కరించినట్లు తెలిపారు. అలాగే 7,389 సేవలు అధికారుల పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. జులై 1 నుంచి 22వ తేదీ వరకూ జిల్లాలో జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 1,66,031, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు 1,62,364, ఆధార్‌కు మొబైల్ నంబర్ అప్డేషన్ 5,168, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 325, కొత్త రేషన్ కార్డులు, రైస్ కార్డుల స్ప్లిట్టింగ్‌కు 1,924, మ్యూటేషన్లు 204, హౌస్ హోల్డ్ నుంచి వివాహమైన వారిని వేరు చేయడం 297, వివాహ ధ్రువీకరణ సర్టిఫికెట్లు 93, సిసిఆర్ కార్డులు 5,270, జనన ధ్రువీకరణ పత్రాలు 297, మరణ ధ్రువీకరణ పత్రాలు 377 జారీ చేసినట్లు తెలిపారు. వాలంటీర్ల ద్వారా సర్వే చేయించి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను సచివాలయాల ద్వారా సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేని, అర్హతలేని సర్టిఫికెట్లను విచారించి అర్హత ఉంటే అందిస్తున్నామని, లేకపోతే లబ్ధిదారుడికి కారణాలు చెప్పి తిరస్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ నెల చివరి వరకూ జరిగే సురక్ష శిబిరాల్లో 11 రకాల సర్టిఫికెట్లను అందించేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్నిరేషన్ డీలర్ల డిమాండ్ చేశారు. రాష్ట్ర డీలర్ల సంఘం పిలుపుమేరకు మండలంలోని రేషన్ డీలర్లు ఆదివారం విజయవాడకు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల పరిష్కారం కోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశానికి తరలివెళ్లారు. విజయవాడ వెళ్లిన వారిలో సంఘం అధ్యక్షుడు అందే వెంకటేశ్వరరావు, సత్తినేని బుజ్జి, మానేపల్లి పుల్లారావు, గొర్రె శ్రీను, కాసాని బాలు, దొంగ ఏడుకొండలు, పోతురెడ్డి సూరిబాబు, ఇంజేటి ప్రకాష్ ఉన్నారు.

విజయవాడ తరలివెళ్తున్న డీలర్లు

పోరుబాట

'సమస్యలు పేరుకుపోతున్నాయి. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పాలకుల్లో ఎటువంటి చలనమూ లేదు. ఈ తరుణంలో బతుకు బండి లాగాలంటే పోరుబాట పట్టక తప్పదని ఈ కాలంలో వివిధ తరగతుల ప్రజలు చేపట్టిన ఆందోళనలు చెప్పకనే చెబుతున్నాయి. ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, విఆర్ఎలు చేపట్టిన ఆందోళనలే దీనికి నిదర్శనం. ఇక దైనందిన సమస్యగా మారిన చేపల చెరువుల అక్రమ తవ్వకాలపై మరోసారి బాధిత జనం కలెక్టరేట్ వద్ద నినదించారు.

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగేళ్లు దాటింది. మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు రానున్నాయి. అయినా గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ పాలకులకు గుర్తుకు రాకపోవడం చిరుద్యోగులను కలవరపరుస్తోంది. దీనికితోడు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో బతుకు బండి లాగడం చాలా కష్టంగా మారింది. గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి ఆరోగ్యానికి సంబంధించి నిత్యం చేదోడువాదోడుగా ఉండే ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ల వద్ద కదంతొక్కారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని, జాబ్‌చార్ట్‌ను పక్కన పెట్టి విధులు అప్పగించడం మానుకోవాలనేది వారి ప్రధాన డిమాండ్లు. ఇవేమీ వారు కొత్తగా కోరుకునేవి కాదు.. గొంతెమ్మ కోర్కెలు అసలు కానేకాదు. ప్రస్తుత పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే కోరుతున్నారు. ఇక జాబ్‌ఛార్ట్ నిర్దేశించింది ఉన్నతాధికారులే. దాన్ని అమలు చేయాలని, అదనపు పనులు ఆపాలనేది వారి విజ్ఞప్తి. పెరిగిన ధరలకు అనుగుణంగా నేటి పాలకులు నాటి హామీలు అమలు చేసినా ఆశా వర్కర్ల కుటుంబాలు బతుకు బండి లాగడం ఇబ్బందే. అయినప్పటికీ కేవలం మీరిచ్చిన హామీలే అమలు చేయాలని కోరుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం గమనార్హం.

ఇక మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు రెండు రోజులు నిరసన దీక్ష చేపట్టారు. వారు కూడా ఆశాల మాదిరిగానే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వైసిపి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము అధికారంలోకి రాగానే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ న్యాయం చేస్తామని, రెగ్యులర్ చేస్తామని నాడు పాదయాత్రలో ప్రతిపక్ష నేతగా జగన్ హామీ ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికుల రెగ్యులర్ ఫైల్ కదిపి దానిలోనూ కొర్రీలు పెట్టారు. 2014 ముందు ఐదేళ్ల సర్వీసు నిబంధన వల్ల గత పదేళ్లుగా ఇదే పనిలో ఉంటున్న వేలాది మంది ఉపాధికి భద్రత లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చకుంటే తదుపరి పోరుబాట కార్యాచరణను సైతం మున్సిపల్ కార్మికులు ప్రకటించడం విశేషం.

గ్రామాల్లో నిత్యం రేయనక, పగలనక అన్ని కాలాల్లోనూ నిరంతరం సేవలందించే విఆర్ఎలు సైతం రెండు రోజులు నిరసన దీక్షలు చేపట్టారు. వారు సైతం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలనేది వారి ప్రధాన డిమాండ్. ఇలా వివిధ తరగతుల ప్రజలు పోరుబాట పడుతున్నారు. వారి ప్రధాన డిమాండ్ గతంలో మీరిచ్చిన హామీలు అమలు చేయండనేదే తప్ప కొత్తగా కోరుతున్నదేమీ లేదు. మరి పాలకులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

కొల్లేరు ప్రాంతంలో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు తీవ్ర అలజడి సృష్టిస్తున్నాయి. నివాసాలకు సమీపంలో, తాగునీటి చెరువుల పక్కన సైతం ఆక్వా చెరువులు యథేచ్ఛగా తవ్వేయడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా కైకలూరు నియోజకవర్గంలో అత్యంత భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా చెరువులు అక్రమంగా తవ్వుతున్నా అధికార యంత్రాంగం సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా అధికారులు స్పందించకపోవగా అక్రమ చెరువుల తవ్వకందారులు బాధిత ప్రజలను బెదిరింపులకు గురిచేశారు. దీంతో బాధిత ప్రజలంతా సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. కలెక్టర్‌కు సమస్యలను వివరించారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ చెరువుల తవ్వకాలను ఆపాలని కలెక్టర్ ఆదేశాలిచ్చినా క్షేత్రస్థాయి యంత్రాంగం ఆ దిశగా కదులుతున్న పరిస్థితి లేదు. చెరువుల తవ్వకం పూర్తయ్యాక అనుమతులు లేని మాట వాస్తవమేనని, కోర్టు ఉత్తర్వులున్నాయని చెప్పి తప్పించుకోవడం మినహా అసలు అనుమతులు ఎలా ఇచ్చారనే దానికి ఎక్కడా సమాధానం ఉండటం లేదు. దీంతో బాధిత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి జనావాసాలకు, తాగునీటి వనరులకు, ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా చెరువుల తవ్వకాన్ని అడ్డుకోవాల్సిన అవసరం, బాధ్యత తప్పనిసరిగా ఉంది. లేనిపక్షంలో ఏదోక రూపంలో బాధిత ప్రజలంతా పోరుబాట పడతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- వివిఎస్‌వి.ప్రసాద్

ప్రమాదకరంగా వంతెన

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని కొల్లేరు గ్రామం రాజులపేట. ఈ గ్రామానికి శివారు దళితవాడ కొత్తచెరువు ప్రాంతం. ఈ శివారు ప్రాంతానికి వెళ్లాలంటే ఉన్న ఏకైక మార్గం చినకాపవరం నుంచి కొల్లేరులోకి వెళ్లే పాత వయ్యేరు కాలువ పైన ఆ గ్రామం మొదట్లో నిర్మించిన ఫుట్ పాత్ వంతెన ప్రధాన మార్గం. సుమారు రెండు దశాబ్దాల క్రితం గ్రామస్తులు చేపట్టిన ఆందోళన ఫలితంగా ఆ వంతెనను నిర్మించారు. వంతెన మోటార్ సైకిల్, నడకవారికి మాత్రమే ఉపయోగిస్తుంది. గ్రామంలోకి ఆటో వెళ్లాలన్నా, కనీసం అంబులెన్స్ వెళ్లాలన్నా కూడా ఒకప్పుడు మార్గంలేని పరిస్థితి. అయితే ఇప్పుడు చిన్నమిల్లిపాడు నుంచి చుట్టూ తిరిగి వెళ్లే రోడ్డు నిర్మించడంతో రెండున్నరకు పైగా కిలోమీటర్లు చుట్టూ తిరిగి ఆ గ్రామంలోకి వెళ్లే అవకాశం వచ్చింది. అది కూడా పూర్తిస్థాయి రోడ్డు కాదు. కాలువ గట్టు కంకర రోడ్డు మాత్రమే. కాలింగ్‌గూడెం గ్రామస్తులు వేసుకున్న పంచాయతీ రోడ్డు. వర్షాకాలం అయితే ఆ రోడ్డు కూడా అంతంత మాత్రమే. కంకర కూడా పూర్తిస్థాయిలో పోయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ రోడ్డు ప్రత్యామ్నాయ మార్గమే తప్ప ప్రధాన రహదారి మాత్రం ఫుట్ పాత్ వంతెన మాత్రమే. కాని ఆ వంతెనకు రైలింగ్ విరిగిపోయింది. ఎప్పుడు ఎవరు ఏ పక్కకి పడిపోతారో తెలియని పరిస్థితి నెలకొంది. నడిచి వెళ్లినా సైకిల్ మీద వెళ్లినా కూడా ప్రమాదకరమైన పరిస్థితి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈ ఒక్క రోడ్డు తప్ప వేరే మార్గం లేదు. కాలింగ్‌గూడెం రోడ్డు కూడా బురద మాయంగా మారడంతో ఇదే ఏకైక మార్గమైంది. ఎప్పుడు ఏ వాహనం కాల్వలో పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వంతెనను వెడల్పు పెంచి కొత్త వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైలింగ్ కూలిపోయిన వంతెన

'ఎస్‌వికెపి' పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి - పెనుగొండ

స్థానిక ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాల అటానమస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల పాలకవర్గం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవివి.అప్పారావు మాట్లాడుతూ 1974లో కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకూ కళాశాల సాధించిన ప్రగతిని, నాక్ 'ఎ' గ్రేడు సిపిఎస్ హోదా, వివిధ రంగాల్లో విద్యార్థులు సాధించిన విజయాలు, ప్రగతి వివరించారు. కళాశాల అధ్యక్షులు పి.సూర్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులను నిర్వహించడం అవసరమని పూర్వవిద్యార్థులను అభినందించారు. అనంతరం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చదువుతో పాటు అనేక నైపుణ్యాలు కలిగి ఉంటేనే విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉందన్నారు. దానికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరం చాలా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులు మచిలీపట్నం సిఐ వి.పెద్దిరాజు మాట్లాడుతూ తానుకూడా ఈ కళాశాలలో చదువుకున్నానని చెప్పారు. మరొక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను కూడా ఈ కళాశాలలో చదివానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసాపురం బస్ డిపో మేనేజర్ సుబ్బారెడ్డి, రిటైర్డ్ టీచర్ కృష్ణారెడ్డి, అనేక రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రసంగిస్తూ కళాశాల గొప్పతనాన్ని కొనియాడారు. కళాశాలకు తమవంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కెవిఆర్.సూర్యనారాయణ కళాశాల అభివృద్ధిని విశదీకరించి అభినందించారు. ఈ సదస్సుకు కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

పారిశుధ్యంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జల్లి కాకినాడలో సచివాలయం ఆధ్వర్యంలో పారిశుధ్యంపై ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామ సర్పంచి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ వీధుల్లో చెత్తాచెదారాలు వేయకుండా ఊరికి దూరంగా వేయాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి స్థానికులకు డెంగీ, మలేరియా వంటి రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ పారిశుధ్య మెరుగుదలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామంలో ప్రజలందరూ రోగాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తడి పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ ర్యాలీలో సచివాలయ కార్యదర్శి అడగర్ల భాస్కరరావు, పిఆర్ఒ కె.వర్మ, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని 25 పంచాయతీల్లో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఆదివారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ -2023 జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని చెప్పారు. తడి పొడి చెత్తను వేరు చేసి ఇంటికి వచ్చిన హరిత రాయబారికి అందించాలన్నారు. వర్షాల వల్ల మురికినీరు ఇంటి పరిసర ప్రాంతాల్లో నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో జరిగిన సమావేశాలకు స్థానిక సర్పంచులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో అధికారులు, ఆశాలు

నేడు వ్యకాస జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఉండి

వ్యవసాయ కార్మిక సంఘం 25వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సనపల శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిందని, 86 సంవత్సరాలుగా రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని తెలిపారు. ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో 24న సోమవారం నిర్వహించే 25వ జిల్లా మహాసభల్లో రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

శ్రమదానం చేస్తున్న ఎస్‌సి కాలనీవాసులు

ఎస్‌సి కాలనీవాసుల శ్రమదానం

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ మేజర్ పంచాయతీ మారెమ్మగూడెంలో ఎస్‌సి కాలనీ వాసులు శ్రమదానం చేసి అందరూ విరాళాలు వేసుకుని సిమెంట్ రోడ్డు నిర్మించుకున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దీంతో తాము విరాళాలు వేసుకుని శ్రమదానం చేసి రోడ్డును నిర్మించుకున్నామని తెలిపారు. కాలనీలో లైట్లు వెలగడంలేదని, మంచినీటి పైపులైన్లు నాణ్యత లేవని, పగిలి పోతున్నాయని, డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో, దోమలు విచ్చలవిడిగా సంచరించడంతో అనారోగ్యాలకు గురవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్‌సి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

సామాజిక వైద్య ఆరోగ్యం కేంద్రంలో కేరళ బృందం

సిహెచ్‌సిని అభివృద్ధి చేయండి

కేరళ బృందం సూచన

ప్రజాశక్తి - ఆకివీడు

సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని డాక్టర్ ఓమన్ మ్యాథ్యూస్ కేరళ వైద్య బృందం ఆసుపత్రి వైద్యులకు సూచించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య పథకాల అమలు పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కేరళ వైద్య బృందం పరిశీలించింది. జెఎస్‌వై, జెఎస్‌ఎస్‌కె, పిఎంఎస్‌ఎంఎ, హెచ్‌ఐఎం ఎస్, సిడి, ఎన్‌సిడి, కంటి వెలుగు, వైఎస్‌ఆర్ క్లినిక్ పథకాల అమలు వాటి పనితీరు పరిస్థితులను రికార్డులను పరిశీలించారు. సిజేరియన్లు ట్యూబెక్టమి, నవజాత శిశు పర్యవేక్షణ ఫార్మసీ, లేబరేటరీ, డెంటల్ విభాగాలను విడివిడిగా పరిశీలించారు. ఈ విభాగాలను మరింత అభివృద్ధి చేసి సేవలు ప్రజలకు మరింత దగ్గరగా తీసుకువెళ్లాలని సూచించారు. సామాజిక ఆరోగ్య కద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ కుమార్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి ఎంఎస్.ప్రసాద్, డాక్టర్ సుగుణరాజు, భాస్కరరావు, ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమార్ పాల్గొన్నారు.

అందరూ విధిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని, పర్యావరణంపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ జి.శ్యామల మాట్లాడుతూ బాల్యం నుంచి మొక్కలు నాటే కార్యక్రమంపై అవగాహన కల్పించినప్పుడే సంపూర్ణంగా పర్యావరణన్ని కాపాడుకోవచ్చన్నారు. హాస్టల్లో గత నాలుగేళ్లుగా దాతల సహకారంతో మొక్కలు నాటుతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు కె.ఇందిర, ఐ.శిరీష, ఎండి.సరోజినీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, గంటా సుందరకుమార్, ఉండపల్లి రమేష్‌నాయుడు మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

1026 ఉద్యోగాలతో ఆదిత్య డిగ్రీ విద్యార్థుల హవా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే ఉత్తమ చదువులు ఎంతో అవసరమని, ప్రఖ్యాత కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం గొప్ప విశేషమని రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.పద్మరాజు అన్నారు. భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల 2022-23లో ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివిధ కార్పొరేట్ సంస్థల్లో 1026 ఉద్యోగాలు సాధించిన సందర్భంగా స్థానిక త్యాగరాజ భవనంలో ఆదిత్య అచీవర్స్ డే వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ పద్మరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. వివిధ కార్పొరేట్ సంస్థల్లో 1026 ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలోని ప్రతి విద్యార్థి డిగ్రీ అయినా వెంటనే ఉద్యోగం కల్పిస్తున్నామన్నారు. 1026 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందని, ఇది వారి తల్లిదండ్రుల విజయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఎన్ విద్యాసంస్థల సెక్రటరీ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, ఆదిత్య విద్యాసంస్థల రీజనల్ మేనేజర్ ఆర్.నాగేంద్రబాబు, ప్రిన్సిపల్ అనురాధ, వైస్ ప్రిన్సిపల్ బి.మావుళ్లు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మూర్తీస్ బుక్ స్టాల్ వారు పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు మెరిట్ విద్యార్థులకు ఆదివారం గ్రామర్ బుక్స్, డిక్షనరీ బుక్స్ ఉచితంగా పంపిణీ చేశారు. బుక్ స్టాల్ ఫౌండర్ నిమ్మల తాతయ్య నాయుడు జ్ఞాపకార్థం ఆయన మనవడు భాను గత 35 సంవత్సరాలుగా మెరిట్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా భానును యునైటెడ్ కాపు క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, అధ్యక్షులు గాదె ఆంజనేయులు, కార్యదర్శి పి.రవికుమార్ కోశాధికారి యినుకొండ శేషాద్రి అభినందించారు .

బెంగాలీ పద్ధతిలో వరినాట్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుతం రైతాంగం సార్వా పంట వరి నాట్లు వేసేందుకు బెంగాలి పద్ధతిపై మక్కువ చూపుతున్నారు. మండలంలోని 12,200 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 80 శాతం రైతులు బెంగాలి పద్ధతిలో వరినాట్లు వేస్తున్నారు. ముఖ్యంగా ఎంటియు 1318 రకం 60 శాతం, స్వర్ణ 30 శాతం, 64 రకం ఐదు శాతం, ఇతర విత్తనాలు కొత్త విత్తనాలు ఐదు శాతం వరి నాట్లు వేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. బెంగాలి వరి నాట్లకు ఎకరానికి రూ.నాలుగు వేలు అవుతుందని పెనుమంట్రకు చెందిన ఒక కౌలు రైతు జక్కంశెట్టి సత్యనారాయణ చెబుతున్నారు. గత 15 ఏళ్లుగా కౌలుకు పంట పండిస్తున్నానని చెప్పారు. మడిలో నుంచి ఆకు తీసి నాట్లు వేసేందుకు రూ.నాలుగు వేలు అవుతుందన్నారు. మామూలుగా మన ప్రాంతంలో ఎకరం ఆకు తీయడానికి రూ.1600 నుంచి రూ.1800 ఖర్చవుతుందని, వరినాట్లు వేయడానికి రూ.2300 అవుతుందని చెబుతున్నారు. వరి నాట్లు వేసిన పదిరోజులకు నత్రజని ఎరువులు వాడాలని ఎఒ ఎ.జ్యోషిల అన్నారు. ఇప్పటికే మండలంలో 1850 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

నాట్లు వేస్తున్న కూలీలు

25న కార్మిక కర్షక జిల్లా సదస్సు

పెనుమంట్ర : మోడీ దుష్పరిపాలన నుంచి రైతులను, శ్రామికులను కాపాడాలని ఈ నెల 25వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమవరంలో ప్యాడి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో కార్మిక కర్షక జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు సమన్వయ కమిటీ కన్వీనర్ ఆకుల హరేరామ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిర్వ హించిన విలేకర్ల సమావేశంలో హరేరామ్ మాట్లాడుతూ వ్యవసాయానికి, రైతాంగానికి తీవ్రమైన హాని కలిగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను, ఎలక్ట్రిసిటీ బిల్లు 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఒక్క పర్యాయం పంట రుణాలను మాఫీ చేయాలని కోరారు. డిమాండ్లను సాధించుకునేందుకు పోరాటం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయం తీసుకుందన్నారు. లక్షలాది కార్మికులు దశాబ్దాల పాటు శాంతియుతంగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల హక్కులను, ప్రయోజనాలను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కేంద్ర ట్రేడ్ యూనియన్లు ఐక్యవేదిక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఇటీవల జూన్ ఎనిమిదో తేదీన, జులై 13వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కమిటీ, సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల ఐక్యవేదిక ఢిల్లీలో సమావేశమై కార్మికులు, కర్షకులు డిమాండ్లను సాధించేందుకు ఐక్యంగా పోరాడాలని, కలిసి కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చాయని చెప్పారు. దానిలో భాగంగానే 25వ తేదీన భీమవరంలో జరిగే సదస్సుకు పెద్ద ఎత్తున రైతులు, కార్మికులు కదలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో జరిగే సదస్సుకు రాష్ట్ర నాయకులు ఎర్నేని నాగేంద్ర, వి.కృష్ణయ్య హాజరవుతారని తెలిపారు.

సాహితీ బేగంను సత్కరిస్తున్న సాహితీ సామ్రాజ్యం నిర్వాహకులు

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం

ప్రజాశక్తి - తణుకు రూరల్

సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఇండియన్ పబ్లిక్ స్కూల్లో ఆదివారం తల్లిదండ్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ అమ్మ ప్రేమకు మారు పేరు, నాన్న నిజమైన బాధ్యతకు మరో రూపం అని తోడు నీడగా ఉండేది తల్లిదండ్రులేనని చెప్పారు. ఇండియన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఎండి సాహిదా బేగం మాట్లాడుతూ తల్లిదండ్రులను ప్రతి నిత్యం గుర్తుంచుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా త్యాగమూర్తులు తల్లిదండ్రులు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎండి సాహిదా బేగంను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ప్రమీల, ఎస్.కె.రహిమాన్, ఎండి అలంగిర్ భాష, ఎం.మోహన్‌రావు, ఎ.ఎన్.ఎల్. రాపర్తి పాపారావు, జి.సువర్ల, డి.విజయశేఖర్, జయశ్రీ, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

సోమేశ్వర సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం గునుపూడి పంచారామ క్షేత్రంలో ఒకటైన ఉమా సోమేశ్వర జనార్దన స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం ప్రసాదాలు అందించారు. ఆయనతో పాటు ధర్మకర్తల మండలి చైర్మన్ కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు కూర్మదాసు సత్య శ్రీనివాస్, నల్లం రఘుబాబు, శ్రీ లక్కు ప్రమీలమ్మ, సోమాదుల లీలాకుమార్, తాడాల రామకృష్ణ, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - ఆచంట

చేనేత కార్మికులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి కార్మికులను ఆదుకోవాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షులు అల్లాడి సూర్యభాస్కరరావు అన్నారు. జాతీయ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆచంట వేమవరంలో చేనేత కార్మికుల సమస్యలపై ఇంటింటికి ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు అల్లాడి సూర్య భాస్కరరావు చేనేత కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలు ఉచిత కరెంటు, నేతన్న నేస్తం వంటివి వస్తున్నాయా అని తెలుసుకున్నారు. చేనేత కార్మికులను గుర్తించి కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే ఆర్థికంగా నిలబడి, ఆత్మహత్యలు నివారించుకోవచ్చన్నారు. చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు తాళ్ల కుమారస్వామి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకుంటున్న కళాకారులు

ఘనంగా కోడి రామకృష్ణ జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

సినీ దర్శకుడు కోడి రామకృష్ణ 74వ జయంతి పాలకొల్లు మారుతి సినిమా థియేటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ మాట్లాడుతూ వందకు పైగా సినిమాలకు దర్శకత్వం వహించిన కోడి రామకృష్ణ లలిత కళాంజలి నాటక అకాడమీ అనే నాటిక సంస్థను స్థాపించి 33 ఏళ్ల జాతీయ నాటిక పోటీలు నిర్వహించారని చెప్పారు. అదే స్ఫూర్తితో పాలకొల్లు కళాపరిషత్ స్థాపించి 14 సంవత్సరాలుగా నాటిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీనివాసరావు, మానాపురం సత్యనారాయణ, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, విస్సకోట వెంకట రమణ, కోడి రామకృష్ణ బాల్య మిత్రుడు కొయ్యాన సూర్యనారాయణ, మారుతి థియేటర్ మేనేజర్ దేవళ్ల బుజ్జి పాల్గొన్నారు.

కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో పాలకొల్లు కళామతల్లి ముద్దుబిడ్డలకు ఆదివారం రాత్రి అవార్డులతో సత్కారం జరిగింది. కీర్తిశేషులు కోడి రామకృష్ణ స్మారక సినీ అవార్డు గ్రహీతలైన పాలకొల్లుకు చెందిన లలిత కళాంజలి నాటక అకాడమీ అధ్యక్షులు అయ్యప్ప రామలింగేశ్వరరావు, సినీ దర్శకులు శివాల ప్రభాకర్, సినీ నటుడు కొప్పిశెట్టి ప్రశాంత, కొంతేరు గ్రామవాసి ఆకుమర్తి బాబూరావు అవార్డులు అందుకున్నారు. సినీ నటులు సుమన్, నిర్మాత తుమ్మలపల్లి సత్యనారాయణ సారధ్యంలో అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి నరసాపురం-గుంటూరు ఫాస్ట్ పాసింజర్

ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురం-గుంటూరు ఫాస్ట్ పాసింజర్ ఈ నెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నరసాపురం నుంచి విజయవాడ వరకు నడపనున్నట్లు రైల్వే డిఆర్‌సిసి మెంబర్ జక్కంపూడి కుమార్ తెలిపారు. అదే విధంగా తిరిగి సాయంత్రం విజయవాడ నుంచి నరసాపురం వరకు రైలు తిరిగి వస్తుందని చెప్పారు. ప్రయాణికులు గమనించాలని కోరారు. విజయవాడ - గుంటూరు మధ్య ట్రాక్ మరమ్మతుల కారణంగా గత నెల్లర ఈ రైలు నిలిచింది. అయితే కనీసం విజయవాడ వరకూ నడపాలని ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

పాఠశాలల్లో రామకృష్ణ సంతాపసభ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్లో సీనియర్ బాస్కెట్ బాల్ కోచ్ నల్లబిల్లి రామకృష్ణ సంతాపసభ ఆదివారం నిర్వహించారు. కిషోర్ ఫౌండర్ ట్రస్ట్ ఫౌండర్ నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో యూత్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పిఈటీ ట్రస్ట్ సభ్యులు, మార్నింగ్ వాక్ సభ్యులు, శిక్షణ పొందిన క్రీడాకారులు పాల్గొన్నారు. రామకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారులు మాట్లాడుతూ మార్టేరు బాస్కెట్‌బాల్ చరిత్రలో ఆయనది ఎన్నటికీ చెరగని ముద్రగా అభివర్ణించారు. సత్తి సుబ్బారెడ్డి జిల్లా మహిళా జట్టుకు రామకృష్ణ పేరు మీదుగా కిట్లను అందించారు. సీనియర్ క్రీడాకారులకు టీ షర్టులను అందించారు. జిల్లా రెడ్డి సంక్షేమ సేవా సంఘం తరఫున ప్రతియేటా చేస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, గొలుగూరి శ్రీనివాసరెడ్డి (ఉప్పాశ్రీను), వెలగల సత్తిరెడ్డి, కర్రి వేణుబాబు, దున్నపూడి సోమిరెడ్డి, నాగిరెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, వినాయకరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, మురళి, సుబ్రహ్మణ్యం, పరకర నాగేశ్వరరావు, కొవ్వూరు రమేందరెడ్డి, అల్లం భాస్కరరెడ్డి, తమనంపూడి ఈశ్వరరెడ్డి, జిఎన్‌విఎస్.కృష్ణారెడ్డి వేణు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ఉన్న మావుళ్లమ్మకు మెట్రో సిమ్ ప్రయివేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు డాక్టర్ నందం వెంకటేశ్వరరావు రూ.5 లక్షల విరాళం అందించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు.

'బేడ బుడగ జంగాలను ఎస్‌సి జాబితాలో కలపాలి'

ప్రజాశక్తి - ఉండి

బేడ బుడగ జంగాల జాతులకు చెందిన వారిని ఎస్‌సిలో కలపాలని సిపిఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉండి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టి ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ బేడ బుడగ జంగాల జాతికి చెందిన వారికి ఎస్‌సి సర్టిఫికెట్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. గతంలో బేడ బుడగ జంగాల జాతులు ఎస్‌సిలోనే ఉండేవారిని, కాని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత వారికి ఎస్‌సి సర్టిఫికెట్లను నిలుపుదల చేశారన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బేడ బుడగ జంగాలపై ఏర్పాటు చేసిన జెసి శర్మ నివేదికను ఆమోదించి కేంద్రానికి పంపాలన్నారు. బేడ బుడగ జంగాలకు ఉరితాడుగా ఉన్న 144 జిఒను రద్దు చేసి వారికి తగు న్యాయం చేయాలని కలిశెట్టి వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సనపల శ్రీనివాస్, తమరాని శ్రీనివాస్, పతివాడ దుర్గా గణపతి, బేడ బుడగ జంగాల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆరేడులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ఉండి :ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు సూచనల మేరకు తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ ఆధ్వర్యంలో మహిళలు మండలంలోని ఆరేడు గ్రామంలో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, టిడిపి ప్రభుత్వం వస్తే ఇచ్చే సంక్షేమ పథకాలకు తేడా వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కిన్నెర వెంకన్న, చెన్నంశెట్టి హరినాయుడు, గొట్టం వెంకటేశ్వరరావు, వత్సవాయి సుజాత, పెద్దింటి నాగలక్ష్మి, వేగేశ్న అనంతలక్ష్మి పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం మండలం, రాయకుదురు శివారు జగన్నాధరావు పేట, డో.నెం. 8-114/2 కాపురస్తులైన కడలి చంద్రశేఖర్, తండ్రి: రమావెంకటసత్యనారాయణ అను నేను ది.02-07-2023న రాయకుదురు నుండి వీరవాసరంకు మోటార్ సైకిల్ పై వెళుతుండగా మధ్య దారిలో దస్తావేజులు పడిపోయినవి. వాటి వివరాలు: దస్తావేజు నెం.1861/2018 మరియు లింకు దస్తావేజు నెం.3043/2017 గల ఓరిజినల్ దస్తవేజులు పడిపోయినవి. కావున దొరికిన వారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కడలి చంద్రశేఖర్
తండ్రి: కడలి రమా వెంకట సత్యనారాయణ,
జగన్నాధరావు పేట, రాయకుదురు,
వీరవాసరం మండలం, ప॥గో॥ జిల్లా.
సెల్: 94933 07573

NOTICE
In the Court of the Hon'ble IInd Addl. District Judge, Eluru
O.S. No. 13/2022

Between:
Sri Panchakarla Vara Prasad ...*Plaintiff*
(rep. by its GPA Holder Sri Koya Syam Kishore)
AND
1. Smt. Amirisetti Sridevi
2. Sri Amirisetti Aruna Kumar
3. Smt. Amirisetti Vijaya ...*Defendants*

To:
D-2: Smt. Amirisetti Sridevi, W/o. (late) Gopichand, R/o. 401, Raja's Pride, Behind Rythu Bazar, Pathebada, Eluru, W.G.Dt.,
D-3: Sri Amirisetti Aruna Kumar, S/o. (late) Gopala Koteswara Rao, R/o. 401, Raja's Pride, Behind Rythu Bazar, Pathebada, Eluru, W.G.Dt.,
D-4: Smt. Amirisetti Vijaya, W/o. Aruna Kumar, R/o. 401, Raja's Pride, Behind Rythu Bazar, Pathebada, Eluru, W.G.Dt.,

పై నెంబరు దావా గ్రంధములో శ్రీ కోర్టు వారు 2వ ప్రతివాది నుండి 4వ ప్రతివాది హాజరు నిమిత్తం పలుమార్లు సమన్లు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం ది. **11-08-2023వ** తేదీన **ఉదయం** గం॥ **10.30** ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ వచ్చి మీ వాదనలు తెలుపుకోవలసినదిగా కోరుచున్నాము. మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావా గ్రంధము పరిష్కరించబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

T.AJIT RAJ
Eluru Advocate for the Plaintiff
Dt: 19-07-2023 Eluru

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814